క్లుప్తంగా

అదుపు తప్పితే అంతే..



రక్షణలేని బ్రిడ్జి

నందిగామ: మండల కేంద్రమైన నందిగామ నుంచి నర్సప్పగూడకు వెళ్లే రహదారిలో వాగుపై నిర్మించిన బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. వాగుపై బ్రిడ్జి నిర్మించిన అధికారులు, రక్షణ ఏర్పాట్లు చేయలేకపోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వర్షాలు కురియడంతో నర్సప్పగూడలోని అక్కమ్మ చెరువు నిండిపోయింది. దీంతో పాటు చెరువు బ్యాక్ వాటర్ ఈ బ్రిడ్జి వరకు నిలిచిపోయింది. ఈ రోడ్డు మీదుగా నిత్యం వేలాది మంది రాకపోకలు కొనసాగిస్తుంటారు. వాహనదారులు ఏ మాత్రం అదుపు తప్పినా.. నీటిలో పడిపోయే ప్రమాదం ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బ్రిడ్జికి రక్షణ గోడ నిర్మించాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కొందుర్గు: విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లేడ్ చౌదరిగూడ కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు కావలి రాజు భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచన మేరకు శుక్రవారం విద్యుత్ సిబ్బందితో కలిసి ఆయన గాలిగూడలో సందర్శించి.. విద్యుత్ సమస్యలను తెలుసుకున్నారు. త్వరలోనే గ్రామంలో విద్యుత్ ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యాదయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాలుష్య పరిశ్రమలపై చర్యలు తీసుకోండి

కొత్తూరు: మండల కేంద్రం సమీపంలోని పారిశ్రామికవాడలో కాలుష్య నియంత్రణ పాటించని పరిశ్రమలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ మండల కార్యదర్శి షకీల్ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. లెడ్ బట్టీలు, పాత టైర్లను కాల్చే పరిశ్రమల నుంచి రాత్రి వేళల్లో ఘాటైన వాయు కాలుష్యం వెలువడుతుందన్నారు. నిర్వాహకులు నిబంధనలు పాటించడం లేదని మండిపడ్డారు. వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

బాలాజీసింగ్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలి

మాడ్గుల: ఉద్యమ నేత, నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్‌కు గవర్నర్ కోటాలో గానీ స్థానిక సంస్థల కోటాలో గానీ ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని సింగిల్ విండో డైరెక్టర్ జగన్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. మాడ్గులలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. బాలాజీసింగ్ తెలంగాణ మలిదశ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో కసిరెడ్డి నారాయణరెడ్డి గెలుపులో బాలాజీసింగ్‌ది కీలకంగా పనిచేశారన్నారు.

తెలంగాణలో ప్రజాపాలన

తలకొండపల్లి: తెలంగాణలో గడీలపాలన నుంచి ప్రజలు విముక్తి పొందారని.. ప్రజా పాలనలో అడుగుపెట్టారని టీపీసీసీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన తలకొండపల్లిలో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయంతో బీఆర్ఎస్ నిర్బంధ పాలన నుంచి ప్రజలకు విముక్తి లభించిందన్నారు. ప్రజలకిచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారెంటీలను ఖచ్చితంగా అమలు చేస్తామన్నారు. ఇప్పటికే మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ, రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వైద్యసాయాన్ని అమలు చేశామన్నారు. 100 రోజుల్లోపు మిగితా గ్యారెంటీలను అమలుచేస్తామన్నారు.

వణుకు పుట్టిస్తోంది..

- జిల్లాపై చలిపంజా
- అత్యంత కనిష్ట ఉష్ణోగ్రత నమోదు
- గతేడాది కంటే ఈ సారి అధికం
- పొంచి ఉన్న సీజనల్ వ్యాధుల ముప్పు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు



షాబాద్: రంగారెడ్డి జిల్లాలో చలిపులి పంజా విసురుతోంది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదైనప్పటికీ.. రాత్రి వేళల్లో చలి వణికిస్తోంది. వారం రోజులుగా రాత్రి ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్నాయి. షాబాద్ మండలం తాళ్లపల్లి గ్రామంలో 10.4 డిగ్రీల అత్యంత కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. క్రమంగా కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ప్రస్తుతం సగటున 16.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. షాబాద్ మండలంలో 13.3 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. వీటికితోడు పగలు, రాత్రి పూట చలిగాలులు వీస్తుండటంతో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పడిపోయే అవకాశముందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆస్తమా, డయాబెటిక్, బీపీ పేషెంట్లు, చిన్నపిల్లలు, బాలింతలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

అక్టోబర్ నుంచి...

అక్టోబర్ 1 నుంచి శీతాకాలం సీజన్ ప్రారంభమైంది. జనవరి 15 వరకు చలి అధికంగా ఉంటుంది. జిల్లాలో సగటు గరిష్ట ఉష్ణోగ్రతలు 27 నుంచి డిగ్రీల నుంచి కనిష్టంగా 17 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. మరో నాలుగైదు రోజుల్లో 14 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. గరిష్ట ఉష్ణోగ్రతల్లో స్వల్ప మార్పులు వచ్చే అవకాశముందని, మరో నెల రోజులు చలి అధికంగా ఉంటుందని చెబుతున్నారు.

గతేడాది కంటే అధికంగానే...

జిల్లాలో చలి తీవ్రత గతేడాది కంటే అధికంగానే ఉంది. రాత్రివేళల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు 12 డిగ్రీల కంటే తక్కువగా నమోదయ్యే అవకాశముంది. శుక్రవారం జిల్లాలోని షాబాద్ మండలం తాళ్లపల్లి గ్రామంలో 10.4 డిగ్రీల అత్యంత కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. చలి తీవ్రత పెరుగుతుండటంతో ఉదయం 9 గంటలైనా జనాలు బయటికి రాలేకపోతున్నారు. రాత్రిపూట 8 గంటలు కాక ముందే ఇళ్లకు చేరుకుంటున్నారు.

అప్రమత్తంగా ఉండాలి



వారం రోజులుగా చలి తీవ్రత పెరిగింది. ఆస్తమా, షుగర్, బీపీ, గర్భిణీ లు, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు అప్రమత్తంగా ఉండాలి. చలిలో ఎలాంటి ప్రయాణాలు చేయవద్దు. ఇళ్లల్లోనే యోగా, వ్యాయామం చేసుకోవాలి. వేడి నీరు తాగితే శరీర ఉష్ణోగ్రతలు సాధారణ స్థితికి చేరుకుంటాయి. వృద్ధులు ఈదురుగాలులు వీచే సమయంలో బయటికి వెళ్లొద్దు. వృద్ధులు, గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలు ఉన్ని దుస్తులు ధరించాలి.

– డాక్టర్ శ్రీనివాస్, జనరల్, క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్

మీ అభిమానం వెలకట్టలేనిది

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ఎమ్మెల్యే శంకర్‌ను సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్: ఎన్నికల్లో తన గెలుపు కోసం కార్యకర్తలు ఎంతో కృషి చేశారని, వారి అభిమానం వెలకట్టలేనిదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కొనియాడారు. మండల పరిధిలోని చించోడ్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు అజ్మత్ బాబా, దేవయ్య, జంగయ్య, అనంతం, యాదయ్య, అంజయ్య ఆధ్వర్యంలో వివిధ యూత్ సంఘాల సభ్యులు వీర్లపల్లి శంకర్‌ను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు, వివిధ సంఘాల సభ్యులు, అభిమానులు ఎంతో కృషి చేశారని ప్రశంసించారు. వారి రుణం తీర్చుకోలేనిదన్నారు. కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎన్నికల్లో చించోడ్ గ్రామ పంచాయితీ నుంచి కాంగ్రెస్ పార్టీకి అధిక మెజార్టీ రావడం హర్షనీయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పల్లెలు మరింత అభివృద్ధి చెందడం ఖాయమని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ప్రభుత్వం రెండింటిని వెంటనే అమలు చేసిందని తెలిపారు. ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలను పార్టీ నాయకులు, ప్రజలకు అందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఎన్నికలకు సిద్ధం కండి

- ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నేత విష్ణువర్ధన్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న విష్ణువర్ధన్ రెడ్డి

కొందుర్గు: స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి సూచించారు. శుక్రవారం కొందుర్గు మండలంలోని రేగడిచిల్కమర్రి, ముట్పూర్, ఉత్తరాసిపల్లి, బైరంపల్లి తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనకు అండగా నిలిచిన వారందరికి ధన్యవాదాలు తెలిపారు. త్వరలో నిర్వహించనున్న గ్రామ పంచాయతీ, మండల పరిషత్ ఎన్నికల్లో అందరూ పాలుపంచుకోవాలని, కార్యకర్తలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ప్రజల పక్షాన పోరాటం చేసేందుకు అందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు అశోక్, శ్రీనివాస్, మోహన్‌సింగ్, శివా రెడ్డి, వెంకట్ రెడ్డి, శ్రీకాంత్, రమేశ్ పాల్గొన్నారు.

ఆ భూమి దేవాదాయ శాఖదే

- ఎండోమెంట్ ఆధీనంలోనే ఆలయ భూమి
- దేవాదాయ భూమిగా పేర్కొంటూ బోర్డు పెట్టిన అధికారులు



బోర్డు ఏర్పాటు చేస్తున్న ఎండోమెంట్ అధికారులు

చేవెళ్ల: మండలంలోని కుమ్మెర గ్రామంలో ఉన్న మహాదేవస్వామి ఆలయ భూములు ఎండోమెంట్ ఆధీనంలోనే ఉన్నాయని రెవెన్యూ అధికారులు, ఎండోమెంట్ అధికారులు తెలిపారు. శుక్రవారం కమ్మెర గ్రామంలోని ఆలయ భూమిని పరిశీలించిన అధికారులు.. దేవాదాయ భూమి అని బోర్డు పెట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కృష్ణయ్య మాట్లాడుతూ.. కమ్మెర గ్రామంలోని మహాదేవ స్వామి ఆలయానికి సర్వే నంబర్ 195లో 5 ఎకరాల 5 గుంటలు, 196లో 3 ఎకరాల 12 గుంటలు మొత్తం 8 ఎకరాల 17 గుంటల భూమి ఉందని తెలిపారు. దీనిని గతంలోనే ఆలయానికి ఇనాంగా ఇచ్చినట్లు గుర్తుచేశారు. అయితే పహానీ రికార్డుల్లో గ్రామానికి చెందిన కొందరి పేర్లు వచ్చాయని, వారి వారసులు కొన్నేళ్ల క్రితం అక్రమంగా ఈ భూమిని నగరానికి చెందిన వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేశారని పేర్కొన్నారు. ఈ విషయం బయటకు రావటంతో దేవాదాయశాఖ అధికారులు స్పందించి.. 2021లోనే ఫిర్యాదులు చేసి అక్రమ రిజిస్ట్రేషన్‌లు రద్దు చేయించినట్లు తెలిపారు. అప్పటి నుంచి ఈ భూమి దేవాదాయశాఖ ఆధీనంలో ఉందని తెలిపారు. అయితే రిజిస్ట్రేషన్‌లు రద్దు అయినప్పటికీ ధరణీ పోర్టల్ ఆప్షన్‌ల ప్రకారం ఎండోమెంట్ భూమి అనే పేరు ఎంట్రీ చేసే ఆప్షన్‌లు లేకపోవటంతో పాత వ్యక్తులు పేర్లు అలాగే ఉన్నాయని వెల్లడించారు. దీనిపై మళ్లీ దేవాదాయశాఖ, రెవిన్యూ అధికారులు సంయుక్తంగా భూమిని పరిశీలించామన్నారు. ఈ భూమిపై హక్కులు ఎవరికీ లేవని తెలిపారు. ఇది ఎండోమెంట్ భూమి కాబట్టి.. అమ్మడం కొనటం నేరమని చెప్పారు. ధరణీలో ఆప్షన్‌లు వచ్చిన వెంటనే ఈ భూమి ఎండోమెంట్ పేరుపైకి మారిపోతుందని చెప్పారు. ఈ భూమిని అక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేశ్, ఈఓ నరేందర్, గ్రామ సర్పంచ్ భానుతేజ, ఉప సర్పంచ్ శ్రీనివాస్, గ్రామస్తులు గోపాల్, లక్ష్మీనారాయణ, శ్రీశైలం, రాములు, అనిల్‌కుమార్ ఉన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న సంఘం సభ్యులు

మొయినాబాద్: మొయినాబాద్ మండల కేంద్రంలోని మెథడిస్ట్ చర్చి మైదానంలో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా మెథడిస్ట్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో హైదరాబాద్ రీజినల్ కాన్ఫరెన్స్ మెథడిస్ట్ బిషప్ ఎంఏ డానియేల్ పాల్గొని.. ఏసుక్రీస్తు జీవిత చరిత్రను వివరించారు. యువత మత్తుకు బానిస కాకుండా క్రీస్తు చూపిన ప్రేమ మార్గంలో పయనించాలని సూచించారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

షాబాద్: పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలని షాబాద్ గ్రామ సర్పంచ్ సుబ్రమణ్యేశ్వరి సూచించారు. శుక్రవారం షాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఆమేజాన్ సహకారంతో పురోగతి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. షాబాద్‌లో త్వరలో 24 గంటలు వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు.

అయ్యప్ప మహాపడి పూజ

షాద్‌నగర్: షాద్‌నగర్ పట్టణంలోని శివమారుతి గీతా అయ్యప్ప మందిరంలో శుక్రవారం రాత్రి అయ్యప్పస్వామి మహాపడి పూజ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయంలో గురుస్వామి సతీషన్ నాయర్ నేతృత్వంలో గిరీషన్ నాయర్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్పకు అష్టాభిషేకం, శివలింగానికి అన్నాభిషేకం, గణపతిపూజ, హోమాలను నిర్వహించారు. సాయంత్రం అర్చన కార్యక్రమం అనంతరం కన్యస్వాములతో పరిగిరోడ్డులోని పోచమ్మ ఆలయం నుంచి శివమారుతి గీతా అయ్యప్ప మందిరం వరకు మహాదీపారాధనతో ఊరేగింపు నిర్వహించారు.

సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, టీచర్లు

మొయినాబాద్: సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల విద్యార్థులకు నల్లకంచెలో ఇటీవల జరిగిన జోనల్ స్థాయి సైన్స్ ఫెయిర్‌లో మొయినాబాద్ మండలం తోలుకట్టలోని చేవెళ్ల గురుకులం విద్యార్థులు ప్రతిభ చాటారు. ఆరోగ్యం, పారిశుద్ధ్యం, పర్యావరణం, వనరులు తదితర అంశాలపై జరిగిన సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు అమూల్య, కృష్ణాక్షయ పర్యావరణ అధ్యయనం, సుస్థిరాభివృద్ధి అనే నమూనాను ప్రదర్శించి తృతీయ బహుమతి అందుకున్నారు. విద్యార్థులను శుక్రవారం ప్రాంతీయ సమన్వయాధికారి శారద వెంకటేశ్, ప్రిన్సిపాల్ రమాదేవి, టీచర్లు శ్వేత, అనిత, అర్చన అభినందించారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విద్యుల్లత

షాద్‌నగర్ రూరల్: విద్యను అభ్యసించే విద్యార్థినీలు ఉపాధ్యాయులుగా మారారు... తోటి విద్యార్థులకు పాఠాలు భోధించారు.. భోధనలో చక్కటి ప్రతిభను కనబరిచి అభినందనలు అందుకున్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కమ్మదనం సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ప్రిన్సిపాల్ విద్యుల్లత ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థుల స్వయం పరిపాలనా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గురుకులాల కార్యదర్శిగా పల్లవి, ఆర్‌సీఓగా మేఘనగౌడ్, డీసీఓగా శాంతి, గురుకులాల జాయింట్ సెక్రటరీగా ప్రణీత, ప్రిన్సిపాల్‌గా హాసిని, వైస్ ప్రిన్సిపాల్‌గా శ్రీవాణి, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్‌గా పాన్విత వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సబ్ రిజిస్ట్రార్ సయ్యద్‌సాదక్ అలీ హాజరై మాట్లాడుతూ... ప్రతి విద్యార్థి మహనీయులను ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులు లక్ష్యాన్ని రూపొందించుకొని నిరంతరం కృషి చేయాలని సూచించారు. అనంతరం ప్రిన్సిపాల్ విద్యుల్లత మాట్లాడుతూ ఉన్నత విద్యతోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. ప్రతి విద్యార్థినీ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యతో పాటుగా అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థినీలు పదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం భోధనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

- షాద్‌నగర్ ఆర్టీసీ డీఎం ఉష



డయల్ యువర్ డీఎంలో సమస్యలను తెలుసుకుంటున్న ఉష

షాద్‌నగర్ రూరల్: ఆర్టీసీ ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని షాద్‌నగర్ డీఎం ఉష తెలిపారు. శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంకు ప్రయాణికులు ఫోన్ ద్వారా సమస్యలు వివరించారు. షాద్‌నగర్ నుంచి హైదరాబాద్ వెళ్లే బస్సుల సంఖ్యను పెంచాలని, మండల పరిధిలోని రంగంపల్లి, మొగిలిగిద్ద బస్టాప్ వద్ద పరిగి వెళ్లే అన్ని బస్సులను నిలపాలని కోరారు. అలాగే ఉదయం వేళల్లో అమన్‌గల్లు రూట్‌లో బస్సుల సంఖ్యను పెంచాలని, షాద్‌నగర్ నుంచి శంకర్‌పల్లికి బస్సును పునరుద్ధరించాలని విన్నవించారు. ప్రయాణికుల సమస్యలకు పరిష్కార మార్గాలను చూపుతూ డీఎం సమాధానామిచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఆర్టీసీని అభివృద్ధి చేసేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి సంస్థను ప్రగతిపథంలో నడిపించేందుకు ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది తోడ్పాటు అందించాలని సూచించారు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులను నడిపించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

‘ధరణి’ దారికి వచ్చేనా..?

- సమస్యలపై సమీక్ష నిర్వహించిన ప్రభుత్వం
- రెవెన్యూ కార్యాలయాల్లో పేరుకుపోయిన దరఖాస్తులు
- సర్కారు నిర్ణయం కోసం ఎదురుచూస్తున్న పట్టాదారులు

షాబాద్: ధరణి సమస్యల పరిష్కారానికి అడుగులు ముందుకేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి పది రోజుల్లో నివేదికను సమర్పించాలని ఉన్నతాధికారులను ఆదేశించింది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ధరణి సమీక్షా సమావేశంతోనైనా వెబ్‌పోర్టల్ దారికి వచ్చి భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ధరణి వెబ్ పోర్టల్ అమలులోకి వచ్చిన తరువాత భూముల సమస్యలను పరిష్కరించడానికి అవసరమైన ఆప్షన్లు ఇవ్వకపోవడంతో అనేక సమస్యలు పెండింగ్‌లోనే ఉన్నాయి. భూముల రికార్డుల్లో తప్పులు దొర్లాయని అనేక మంది రెవెన్యూ కార్యాలయాల్లో దరఖాస్తులిచ్చి.. పట్టా భూముల సమస్యలను పరిష్కరించాలని కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. గత ప్రభుత్వం అర్జిదారుల విన్నపాలను పట్టించుకోక పోవడంతో జిల్లాలో దాదాపు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. 2018లో డిజిటల్ పట్టా పుస్తకాలు జారీ చేయక ముందు ఉన్న పట్టాదారు పాసు పుస్తకాల్లో భూమి యజమాని వివరాలు సరిగా ఉన్నా.. ఆన్‌లైన్‌లో ఒకరి భూమి మరొకరి పేరు మీదికి మారిపోయింది. మాన్యువల్ పట్టా పుస్తకాల్లో భూమి వివరాలు సరిగా ఉన్నా.. ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడం రెవెన్యూ శాఖ తప్పిదమే. ఈ తప్పిదాలను సరిదిద్దడానికి ఆప్షన్లను ఇప్పటి వరకు ఇవ్వలేదు. మాన్యువల్ రికార్డుల్లో పట్టా భూమి అని ఉంటే ఆన్‌లైన్‌లో అసైన్‌మెంట్ అని నమోదు కావడం, యజమానులు, వారి తండ్రి, భర్త పేర్లు తప్పుగా నమోదు కావడం .. భూ విస్తీర్ణంలో తేడాలుండడం.. ఇలా ఎన్నో సమస్యలు ఉత్పన్నమయ్యాయి.

కొత్త ప్రభుత్వంపై ఆశలు

ధరణి వెబ్‌పోర్టల్‌లో ఆప్షన్లు ఇవ్వకపోవడంతో భూముల సమస్యలు పరిష్కారం కాకుండా అలాగే ఉండిపోయాయి. కొందరు రైతులకైతే తాము సాగు చేస్తున్న భూమి తమ ఆధీనంలో ఉన్నా వేరొకరి పేరిట పట్టా చేయడంతో రైతుబంధు, బీమా ప్రయోజనాలు దక్కలేదు. దశల వారిగా ఆప్షన్‌లను ఇస్తామని గత ప్రభుత్వం ప్రకటించినా.. ఆచరణలో మాత్రం అమలు చేయలేదు. తాము అధికారంలోకి వస్తే ధరణిలో సంస్కరణలు తీసుకురావడం లేదా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొంది. కొత్త ప్రభుత్వం కొలువు దీరిన కొద్ది రోజుల్లోనే ధరణిపై సమీక్ష జరుపడంతో తమ భూసమస్యల పరిష్కారం అవుతాయని దరఖాస్తుదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ధరణి దారికి తీసుకొచ్చి వీలైనంత తొందరగానే భూముల సమస్యలకు పరిష్కారం చూపాలని పలువురు కోరుతున్నారు.

హామీలతోనే సరి.. పట్టించుకోరా మరి!

- పొంచి ఉన్న విద్యుత్ ప్రమాదాలు
- పలువురు మృతి
- పట్టించుకోని అధికారులు



కొత్తూరు పట్టణంలో ఇళ్లపై నుంచి తీసిన విద్యుత్ లైన్లు

కొత్తూరు: కొత్తూరు మున్సిపాలిటీతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఇళ్ల, ప్రధాన రోడ్ల పక్కన ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల కారణంగా తరచుగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వీటిని తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు, విద్యుత్‌శాఖతో పాటు ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. ఎన్నికల సమయంలో పార్టీల నాయకులు విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామని హామీలిస్తూ.. గెలిచిన తర్వాత పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. కొత్త ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుకుంటున్నారు.

ప్రమాదాలు ఇలా..

- జాతీయ రహదారి పక్కన ఐదేళ్ల క్రితం ఎంఆర్‌ఎఫ్ టైర్లతో వెళుతున్న భారీ కంటెయినర్ విద్యుదాఘాతానికి గురై టైర్లు, వాహనం కాలిపోయింది. అదృష్టవశాత్తు డ్రైవర్ ప్రాణాలతో బయటపడ్డాడు.
- మూడేళ్ల క్రితం తిమ్మాపూర్ హెచ్‌ఐఎల్ పరిశ్రమ ఎదురుగా ఓ లారీ క్లీనర్ లారీపైన టార్పాలిన్ కడుతుండగా విద్యుత్ తీగలు తాకడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు.
- తిమ్మాపూర్‌లో ఓ బాలుడు రెండేళ్ల క్రితం ఇంటిపైన ఆడుకుంటుండగా విద్యుత్ తీగల కారణంగా ప్రమాదానికి గురైయ్యాడు. అదృష్టవశాత్తు బాలుడు ప్రాణాలతో బయటపడ్డాడు.
- తిమ్మాపూర్‌లో మూడేళ్ల క్రితం ఇంటర్ చదువుతున్న విద్యార్థిని హర్షిత బాల్కనీలో నిలబడగా సమీపంలోని విద్యుత్ తీగల కారణంగా మంటలు అంటుకున్నాయి. తీవ్రంగా గాయపడిన ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది.
- గత రెండు నెలల క్రితం కొత్తూరు పట్టణంలోని నారాయణగూడ కాలనీలో ఓ ఇంటిపై ప్లంబింగ్ పనులు చేస్తూ.. ప్లంబర్ ప్రమాదశాత్తు విద్యుదాఘాతానికి గురై చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం



కొత్తూరుతో పాటు అయా గ్రామాల్లో ఇళ్లపై నుంచి తీసిన విద్యుత్ తీగలు, ఇళ్లను తాకుతూ ఉన్న స్తంభాలను తొలగించాలని పలువురు వినతిపత్రాలు అందజేశారు. వినతులను ఉన్నతాధికారులకు పంపాం. లైన్ షిఫ్టింగ్‌తో పాటు స్తంభాలను మార్చడానికి ప్రజలే ఖర్చు భరించాలి. కొత్త లైన్ కోసం సర్వే చేసి.. ఎవరూ అభ్యంతరం తెలుపకుంటే పనులు చేపట్టాల్సి వస్తుంది.

– సాయికృష్ణ, ఏఈ ట్రాన్స్‌కో, కొత్తూరు